ఆంధ్రజ్యోతి
ANDHRAJYOTHY
5
పార్వతీపురం మన్యం
జిల్లా వార్తలు
సోమవారం 24 నవంబరు 2025



అప్‌గ్రేడైనా..తప్పని అగచాట్లు

- చినుకుపడితే చిత్తడిగా మారుతున్న వైనం
- ఇదీ రాజాం మునిసిపాలిటీలో పరిస్థితి

7లో



సప్తగిరి కాలనీలో నిలిచిన నీరు



పెద్దగెడ్డ ప్రాజెక్టు

ప్రాజెక్టుల ఆధునికీకరణకు.. మరో మూడేళ్లు

- 2028 వరకు గడువు పొడిగించిన ప్రభుత్వం
- జిల్లాలో నాలుగు ప్రాజెక్టులకు కలగనున్న మోక్షం
- పాత రేట్లతో పనులు చేయలేమంటున్న కాంట్రాక్టర్లు

జియ్యమ్మవలస, నవంబరు 23 (ఆంధ్రజ్యోతి)

జిల్లాలో పూర్తిస్థాయిలో భూములకు సాగునీరందాలంటే ప్రాజెక్టుల ఆధునికీకరణ ఎంతో అవసరం. ఈ విషయంలో 2014 తరువాత టీడీపీ ప్రభుత్వం చొరవ చూపి జపాన్ ఇంటర్నేషనల్ కోఆపరేటివ్ ఏజెన్సీ (జైకా)తో మాట్లాడి నిధులు మంజూరు చేయించేలా చర్యలు తీసుకుంది. దీని ఫలితంగా 2019 జనవరిలో జైకా నిధులు మంజూరయ్యాయి. దీంతో త్వరితగతిన పనులు పూర్తి చేయాలని కోరింది. అయితే, ఆ తరువాత అధికారంలోకి వచ్చిన వైసీపీ ప్రభుత్వం ఐదేళ్ల పాటు ప్రాజెక్టులను పట్టించుకోలేదు. ప్రస్తుతం కూటమి ప్రభుత్వం ఈ విషయాన్ని మరొకసారి జైకా ముందు ప్రస్తావించింది. ఫలితంగా ప్రాజెక్టుల ఆధునికీకరణకు 2028 జూలై 6వ తేదీ వరకు గడువు ఇచ్చింది. ఈ బాధ్యతలను రాష్ట్ర ప్రభుత్వంతో పాటు జైకా ప్రతినిధిగా ఉన్న రాష్ట్ర నీటి పారుదల, జీవనోపాధి మెరుగుదల ప్రాజెక్టు-2 (అపిలిప్-2) సంయుక్తంగా పర్యవేక్షించనున్నాయి. పూర్తి పర్యవేక్షణ బాధ్యత మాత్రం అపిలిప్-2దే.

ఇదీ ప్రాజెక్టుల పరిస్థితి..

జిల్లాలో వట్టిగెడ్డ, పెద్దగెడ్డ, పెదంకలాం, వెంగళరాయసాగర్ ప్రాజెక్టులను అభివృద్ధి చేయాల్సి ఉంది. 2018లో జైకా ఇంజనీర్ల బృందం ఈ ప్రాజెక్టులను పరిశీలించి రూ.153.83 కోట్లు మంజూరు చేసింది. కానీ, గత వైసీపీ ప్రభుత్వ నిర్లక్ష్యం, అధికారుల తాత్సారంతో ఆధునికీకరణ పనులు నత్తనడకన సాగాయి. చివరికి గడువు కూడా ముగిసిపోయింది. అయితే, ఈ గడువును తాజాగా మరో మూడేళ్లు పెంచడంతో కొందరు కాంట్రాక్టర్లు పాత రేట్లతో పనులు చేయలేమని నీటి పారుదలశాఖ అధికారులకు చెబుతున్నట్లు భోగట్టా. మరి దీనిపై ప్రభుత్వం ఏ మేరకు స్పందిస్తుందో వేచి చూడాలి.

పెదంకలాం..

ఈ ప్రాజెక్టు సీతానగరం మండలం పెదంకలాం వద్ద ఉంది. దీనిద్వారా బలిజిపేట మండలంలో 6,617.16 ఎకరాలకు, విజయనగరం జిల్లా (మిగతా 8వ పేజీలో..)

పెద్దగెడ్డ..

ఈ ప్రాజెక్టు పాచిపెంట మండలంలో ఉంది. ఈ ప్రాజెక్టుకు పాచిపెంట మండలంలో 6,039 ఎకరాలు, సాలూరు మండలంలో 2,839 ఎకరాలు, రామభద్రపురం మండలంలో 3,122 ఎకరాలు మొత్తం 12 వేల ఎకరాలకు సాగునీరందించే సామర్థ్యం ఉంది. ఈ ప్రాజెక్టు ఆధునికీకరణకు ఎం/ఎస్ జీవీవీ - వైఎంఎంఆర్ (జేవీ) సంస్థలు (హైదరాబాద్) రూ.23.83 కోట్లతో ఒప్పందం కుదుర్చున్నాయి. 2023 డిసెంబరు 31 నాటికి పనులు పూర్తి చేయాల్సి ఉంది. కానీ ఇంతవరకు 20 శాతం పనులు మాత్రమే జరిగాయి. ఈ బిల్లులు పెండింగ్‌లో ఉన్నాయి.

వట్టిగెడ్డ..

ఈ ప్రాజెక్టు జియ్యమ్మవలస మండలం తాళ్లడుమ్మ పంచాయతీ రావాడ గ్రామానికి ఆనుకొని ఉంది. దీని కుడి, ఎడమ ప్రధాన కాలువల ద్వారా 16,680 ఎకరాలకు సాగునీరందించేలా నిర్మించారు. ఆధునికీకరణకు 2019 జనవరి 8న రూ. 44.85 కోట్లతో పరిపాలనా ఆమోదం, 2020 ఆగస్టు 19న సాంకేతిక ఆమోదం లభించాయి. ఈ పనులను శ్రీసాయి కనస్ట్రక్షన్ (విజయవాడ) దక్కించుకుంది. 2023 జనవరి 7 నాటికి పనులు పూర్తి చేస్తామని చెప్పింది. అయితే, పనులు నత్తనడకన జరగడంతో మళ్లీ 2024 జూలై 7 నాటికి పూర్తి చేస్తామని అంగీకరించింది. అప్పటివరకు 15 శాతం పనులే జరిగాయి. చేసిన పనులకు బిల్లులు అందకపోవడంతో కాంట్రాక్టర్ చేతులెత్తేశాడు.

ఆధునికీకరణ కోసం ఎదురు చూస్తున్న వట్టిగెడ్డ ప్రాజెక్టు





సత్యసాయిబాబా చిత్రపటం వద్ద పూజలు చేస్తున్న మంత్రి సంధ్యారాణి

సత్యసాయిబాబా ఉపదేశాలు

సమాజానికి మార్గదర్శకాలు

- మంత్రి గుమ్మిడి సంధ్యారాణి

సాలూరు, నవంబరు 23(ఆంధ్రజ్యోతి): భగవాన్ సత్యసాయిబాబా ఇచ్చిన ఉపదేశాలు సమాజానికి శాశ్వత మార్గదర్శకాలు అని మంత్రి గుమ్మిడి సంధ్యారాణి అన్నారు. స్థానిక ఎంపీడీవో కార్యాలయంలో ఆదివారం సత్యసాయిబాబా జయంతి వేడుకలను ఘనంగా నిర్వహించారు. ఈ వేడుకలకు మంత్రి సంధ్యారాణి ముఖ్య అతిథిగా హాజరై మాట్లాడారు. బాబా ఎల్లప్పుడూ చెప్పిన సత్యం, ధర్మం, శాంతి, ప్రేమ, అహింస విలువలు ప్రతిఒక్కరి జీవితంలో ఆచరణీయమైనవని అన్నారు. ప్రేమ, సేవ, మానవతా తత్వాలతో సమాజం ముందుకు సాగితేనే బాబా ఆశయాలు నిజంగా నెరవేరుతాయని అన్నారు. ప్రజా సంక్షేమం కోసం ప్రభుత్వం చేపడుతున్న కార్యక్రమాలు కూడా ఈ సేవా భావానికి ప్రతీకలని మంత్రి పేర్కొన్నారు. అనంతరం సత్యసాయిబాబాకు ప్రత్యేక పూజలు చేశారు. కార్యక్రమంలో ఎంపీడీవో కార్యాలయ సిబ్బంది, సేవాదళ సభ్యులు, మహిళా సంఘాలు, స్థానిక భక్తులు భారీ సంఖ్యలో పాల్గొన్నారు.

స్నానానికి దిగి.. రబ్బర్ డ్యాంలో గల్లంతై

- నీటిలో కొట్టుకుపోయిన ముగ్గురు యువకులు
- గాలిస్తున్న పోలీసు, అగ్నిమాపక సిబ్బంది
- సివిని గ్రామంలో విషాదఛాయలు



ప్రదీప్‌కుమార్ (ఫైల్)



శరత్‌కుమార్ (ఫైల్)



గోవిందనాయుడు (ఫైల్)



రోదిస్తున్న శరత్‌కుమార్ కుటుంబీకులు

కొమరాడ, నవంబరు 23 (ఆంధ్రజ్యోతి): వారంతా స్నేహితులు. ముందురోజు జరిగిన తన మిత్రుడి వివాహంలో అంతా కలిసి సందడి చేశారు. మరుసటి రోజు సరదాగా స్నానం చేసి వద్దామని గ్రామానికి పది కిలోమీటర్ల దూరంలో ఉన్న జంఝావతి రబ్బర్ డ్యాం వద్దకు వెళ్లారు. ముందుగా నీటిలోకి దిగిన ఓ యువకుడు వరద ప్రవాహానికి కొట్టుకుపోతుండగా, మరో ఇద్దరు కాపాడే ప్రయత్నం చేశారు. అయితే, మొత్తం ముగ్గురు కూడా గల్లంతయ్యారు. ఈ ఘటన ఆదివారం కొమరాడ మండలం రాజలక్ష్మీపురం వద్దనున్న జంఝావతి రబ్బరు డ్యాం వద్ద చోటుచేసుకుంది. పోలీసుల వివరాల మేరకు.. కొమరాడ మండలం సివిని గ్రామానికి చెందిన అధికారి గోవింద నాయుడు (38), అరసాడ ప్రదీప్ (29), రాయగడ శరత్‌కుమార్ (17)తో పాటు మరో ఐదుగురు స్నేహితులు ఆదివారం మధ్యాహ్నం రబ్బర్ డ్యాంను చూసేందుకు వెళ్లారు. సరదాగా స్నానం చేసేందుకు ముందుగా శరత్ నీటిలో దిగగా వరద ఉధృతికి కొట్టుకుపోతుండడాన్ని గోవిందనాయుడు, ప్రదీప్ చూసి కాపాడే ప్రయత్నం చేశారు. ఈ క్రమంలో ముగ్గురు కూడా గల్లంతవడంతో మిగిలిన స్నేహితులు ఏమిచేయాలో తెలియక ఆర్తనాదాలు పెట్టారు. సమాచారం తెలుసుకున్న పోలీసులు, అగ్నిమాపక సిబ్బంది ఘటనా స్థలానికి చేరుకున్నారు. గల్లంతైన వారి కోసం వెతికినా ఎలాంటి ఆచూకీ లభ్యంకాలేదు. వరద ఉధృతి అధికంగా ఉండడంతో ఇరిగేషన్ సిబ్బంది నీటిని వ్యవసాయ పొలాలకు వెళ్లే ప్రధాన కాలువ గుండా మళ్లించి గాలింపు చర్యలు చేపడుతున్నారు.

గ్రామంలో విషాదం..

ఒకే గ్రామానికి చెందిన ముగ్గురు వ్యక్తులు గల్లంతుకావడంతో గ్రామస్థులంతా విషాదంలో మునిగిపోయారు. వీరి కుటుంబ సభ్యులు కన్నీరుమున్నీరుగా విలపిస్తున్నారు. గోవిందనాయుడు తన గ్రామంలో వెల్డింగ్‌షాప్ (మిగతా 8వ పేజీలో..)



వివరాలు సేకరిస్తున్న ఎస్ఐ నీలకంఠం



విద్యార్థినులకు ఆహారం వడ్డిస్తున్న కలెక్టర్, జేసీ

బాలికలకు స్వీయ రక్షణ అవసరం

- కలెక్టర్ ప్రభాకర్ రెడ్డి

సీతానగరం/బెలగాం, నవంబరు 23 (ఆంధ్రజ్యోతి): జిల్లాలోని పాఠశాలలు, కళాశాలల బాలికలకు స్వీయ రక్షణ అవసరమని కలెక్టర్ ఎస్.ప్రభాకర్‌రెడ్డి అన్నారు. ఆదివారం జోగంపేట కస్తూర్బా బాలికల విద్యాలయంలో సమగ్ర శిక్ష, రుద్రమదేవి సెల్ఫ్ డిఫెన్స్ అకాడమీ, స్పోర్ట్స్ అండ్ కల్చరల్ ఫౌండేషన్ ఆధ్వర్యంలో 'రాణి లక్ష్మీబాయ్' స్వీయ రక్షణ కార్యక్రమం నిర్వహించారు. ఈ కార్యక్రమంలో పాల్గొన్న కలెక్టర్ మాట్లాడుతూ.. ప్రభుత్వ పాఠశాలల, కళాశాల బాలికలకు ఆత్మ రక్షణ అందించే లక్ష్యంతో ఈ కార్యక్రమం చేపట్టామన్నారు. ప్రతి ఒక్కరికీ ఆత్మ రక్షణ అవసరమని, దాని ప్రాధాన్యతను బాలికలకు వివరించారు. విద్యతో పాటు స్వీయ రక్షణ నైపుణ్యాలు ముఖ్యమని తెలిపారు. ఎన్ని డిగ్రీలు ఉన్నా, ఎంత విద్య నేర్చినా ముందుగా మన ప్రాణాలను కాపాడుకునే తెలివి తేటలను ప్రతి ఒక్కరూ కలిగి ఉండాలని ఉద్బోధించారు. బాలికలు భవిష్యత్‌లో ఉన్నత చదువులు చదివి పీహెచ్‌డీలు చేసి పెద్ద ఆఫీసర్లుగా ఎదగాలని ఆకాంక్షించారు. అనంతరం విద్యార్థినులకు అందిస్తున్న ఆహారం తనిఖీ చేసి, వారికి వడ్డించారు. జేసీ యశ్వంత్ కుమార్ రెడ్డి, సమగ్ర శిక్ష ఏపీసీ ఆర్.తేజేశ్వరరావు, కోఆర్డినేటర్ ఎస్.ప్రభాకర్ పాల్గొన్నారు.

ప్రారంభించారు.. పూర్తిచేయడం మరిచారు

- రాళ్లుతేలడంతో వాహనచోదకుల రాకపోకలకు తప్పని అగచాట్లు 7లో
- ఇదీ గరివిడి మండలంలో బీటీరోడ్ల పనుల పరిస్థితి

పర్యవేక్షణ లేక.. ఆక్రమణలపై చర్యలు తీసుకోక

- ఇదీ కిల్తంపాలెం, ముషిడిపల్లిలో అక్రమ నిర్మాణాల పరిస్థితి

7లో

ఘనంగా సత్యసాయి జయంత్యుత్సవం

8లో

మన్యంలో పర్యాటకుల సందడి

8లో

'తోటపల్లి' ట్రస్ట్ బోర్డు ప్రమాణ స్వీకారం

- చైర్మన్‌గా పకీరునాయుడు

8లో

మళ్లీ వాన గండం

- మారిన వాతావరణం
- రెండు రోజులుగా మబ్బులు
- ముమ్మరంగా వరి కోతలు
- రైతుల్లో ఆందోళన

పాలకొండ, నవంబరు 23 (ఆంధ్రజ్యోతి): అన్నదాతను వరుణుడి గండం వీడడం లేదు. జిల్లా వ్యాప్తంగా ఖరీఫ్ వ్యవసాయ పనులు ముమ్మరంగా సాగుతున్నాయి. ఈ తరుణంలోనే వాతావరణ శాఖ వర్షాలు పడే అవకాశం ఉందని పేర్కొనడం, జిల్లాలోని వాతావరణ పరిస్థితులు కూడా అందుకు అనుగుణంగా ఉండడంతో రైతాంగం ఆందోళన చెందుతోంది. ఈ నెల 29 వరకు వర్షాలు కురిసే అవకాశం ఉందని వాతావరణశాఖ ఇప్పటికే హెచ్చరికలు జారీ చేసింది. దీంతోపాటు సేన్యార్ తుఫాన్ ప్రభావం కూడా ఉండవచ్చునని, ఇది డిసెంబరు 2 వరకు ప్రభావం చూపే అవకాశం ఉందని వాతావరణ శాఖ పేర్కొంటుంది. దీంతో అన్నదాతల్లో మరింత ఆందోళన నెలకొంది. జిల్లా వ్యాప్తంగా ఈ ఏడాది ఖరీఫ్ కింద రెండు లక్షలకు పైగా ఎకరాల్లో వరి, పత్తి, ఇతర వాణిజ్య పంటలను రైతాంగం సాగు చేస్తుంది. వ్యవసాయ పనులు ముమ్మరంగా చేపడుతున్న సమయంలోనే వరుణుడి గండం ఉందని వాతావరణ శాఖ హెచ్చరికలతో జిల్లా రైతాంగం వణుకుతుంది.



కోతకు సిద్ధంగా ఉన్న వరి పంట

ముమ్మరంగా వరికోతలు..

జిల్లా వ్యాప్తంగా ఇప్పటివరకు సుమారు 50 శాతం వరకు వరి కోతలు పూర్తయ్యాయి. వాటిలో 30 శాతం వరకు కుప్పలు రూపంలో వేయగా, మరో 20 శాతం వరి పనలు (ఓదెలు) రూపంలో పంట పొలాల్లోనే ఉన్నాయి. అలాగే మరో 50 శాతం వరకు పంట కోతకు సిద్ధంగా ఉంది. ఇటువంటి సమయంలో జిల్లా వ్యాప్తంగా గత రెండు రోజులుగా మబ్బుల వాతావరణం నెలకొనడంతో రైతులు ఆందోళన చెందుతున్నారు. చిన్నపాటి వర్షం కురిసినా, గాలులు వీచినా నష్టం వాటిల్లే అవకాశం ఉంది. ప్రతి ఏటా ఖరీఫ్ పంట చేతికి అందుతున్న సమయంలోనే తుపాన్లు, అల్పపీడనాలు, వాయుగుండాలు అన్నదాతను కంటి మీద కునుకు లేకుండా చేస్తున్నాయి.



పొలంలో కోత కోసి ఉన్న వరి పనలు

నలుగురు సచివాలయ కార్యదర్శుల సస్పెన్షన్

ఆంధ్రజ్యోతి ఎఫెక్ట్



ఈ ఏడాది ఆగస్టు 13న 'ఆంధ్రజ్యోతి'లో వచ్చిన కథనం

- నిధుల దుర్వినియోగంపై అధికారుల చర్యలు

పార్వతీపురం/కొమరాడ, నవంబరు 23 (ఆంధ్రజ్యోతి): మండల కేంద్రం కొమరాడ పంచాయతీలో నిధులు దుర్వినియోగానికి పాల్పడిన నలుగురు సచివాలయ కార్యదర్శులను సస్పెండ్ చేస్తూ కలెక్టర్ ప్రభాకర్‌రెడ్డి ఆదివారం ఆదేశాలు జారీ చేశారు. కొమరాడ పంచాయతీకి గత నాలుగేళ్లలో ప్రభుత్వం నుంచి రూ.95లక్షలు మంజూరయ్యాయి. ఇందులో అత్యధిక నిధులు పక్కదారి పట్టినట్లు పీజీఆర్ఎస్‌కు పలు ఫిర్యాదులు అందాయి. దీనిపై 'ఆంధ్రజ్యోతి'లో వరుస కథనాలు రావడంతో కలెక్టర్ (మిగతా 8వ పేజీలో..)

అప్‌గ్రేడైనా..తప్పని అగచాట్లు

● చినుకుపడితే చిత్తడిగా మారుతున్న వైనం ● ఇదీ రాజాం మునిసిపాలిటీలో పరిస్థితి

రాజాం రూరల్, నవంబరు 23 (ఆంధ్రజ్యోతి): రాజాం నగర పంచాయతీ నుంచి మునిసిపాలిటీగా అప్‌గ్రేడైనా ప్రజలకు అగచాట్లు తప్పడంలేదు. పంచాయతీ నుంచి మేజర్ పంచాయతీ, నగర పంచాయతీ, ఆపై మునిసిపాలిటీగా శరవేగంగా రూపాంతరం చెందింది. అయితే నేటికీ పల్లె వాతావరణమే కనిపిస్తోంది. పాలకమండళ్లు లేకపోవడం, ప్రజాప్రతినిధుల నిర్లక్ష్యం వెరసి కనీససౌకర్యాలు కొరవడ్డాయి. పంచాయతీగాఉన్న సమయంలో నిర్మించిన రోడ్లు, కాలువలు కావడంతో చినుకుపడితే మెయిన్‌రోడ్‌తో పాటుపలు వీధుల్లో నీరుచేరి చిత్తడిగా మారుతోంది. రోజుల తరబడి నిల్వఉంటుండడంతో ప్రజలకు అవస్థలుతప్పడంలేదు. దీనికితోడు కాలువల్లో చెత్త పేరుకుపోవడం వల్ల మురుగునీరు రోడ్డుపైకి చేరుతోంది. ప్రధానంగా మునిసిపాలిటీలో అధికారుల పర్యవేక్షణ సైతం లేకపోవడంతో అడుగడుగునా మురుగు నీటి నిల్వలు, ఖాళీ స్థలాల్లో వ్యర్థాలు దర్శనమిస్తున్నాయి.దీంతో దోమలు స్వైరవిహారంచేస్తుండడంతో వ్యాధులు బారినపడుతున్నామని పలువురు వాపోతున్నారు. కమిషనర్లు ఎంతమంది వచ్చి వెళ్తున్నా మౌలిక వసతులపై దృష్టిసారించడంలేదని పలువురు వాపోతున్నారు. రెండు దశాబ్దాలుగా పాలకమండలి లేకపోవడంతో ప్రత్యేకాధికారి పాలనలోనే కొనసాగుతోంది. దీంతో పట్టణవాసులకు మురుగు, వర్షం కురిస్తే వరద సమస్యలు వెంటాడుతున్నాయి.



మెయిన్‌రోడ్‌లోకి చేరిన మురుగు నీరు(ఫైల్)



రాజాం: సుందరం మందిరంలో నృత్య ప్రదర్శన చేసిన బాలవికాస్ చిన్నారులను అభినందిస్తున్న అధికారులు,నిర్వాహకులు



డెంకాడ: సత్యసాయిబాబా గ్రామ సంకీర్తన చేస్తున్న భక్తులు



విజయనగరం దాసన్నపేట:ఒరుగంటి వారితోటలో విష్ణు సహస్రనామం పఠనం చేస్తున్న మహిళలు

సాయి బాబా మార్గం అనుసరణీయం

● వైభవంగా జయంత్యుత్సవాలు ● ప్రత్యేక కార్యక్రమాల ఏర్పాటు

సాయిబాబా మార్గం అనుసరణీయమని వక్తలు తెలిపారు. ఆదివారం జిల్లాలో సత్యసాయి బాబా జయంత్యుత్సవాలు నిర్వహించారు. ఈసందర్భంగా ఉయ్యాలసేవ, అన్నసమారాధన, వృద్ధులకు దుప్పట్లు పంపిణీ, సాయిసంకీర్తనలతో ప్రత్యేక కార్యక్రమాలు ఏర్పాటుచేశారు. తొలుత సత్యసాయి చిత్రపటానికి పూలమాలలు వేసి నివాళులర్పించారు. చిన్నారులు ప్రదర్శించిన పలు సాంస్కృతిక కార్యక్రమాలు ఆకట్టుకున్నాయి.

●బొండపల్లి, నవంబరు 23(ఆంధ్రజ్యోతి):శాంతి, ప్రేమ,స్వచ్ఛమైన సేవలకు బాబాప్రతిరూపమని మంత్రి కొండపల్లిశ్రీనివాస్ తెలిపారు. మండలంలో వెదురువాడ పంచాయతీ పరిధిలోగల కువ్వాడపేటలో సత్యసాయి సేవా సమితి ఆధ్వర్యంలో బాబా శతజయంత్యుత్సవాలు నిర్వహించారు.

●చీపురుపల్లి, నవంబరు 23 (ఆంధ్రజ్యోతి):భగవాన్ సత్యసాయి బోధనలు అందరికీ ఆదర్శమని డీఎల్‌డీవో హేమసుందర్ తెలిపారు. స్థానిక ఎంపీడీవోకార్యాలయంలో జరిగిన సత్యసాయి బాబా జయంత్యుత్సవాల్లో ఏవో ప్రవీణ్, సిబ్బంది సురేష్, లక్ష్మణరావు, రామకృష్ణ పాల్గొన్నారు.

బావిలో పడి ఒకరి మృతి

భోగాపురం, నవంబరు23(ఆంధ్రజ్యోతి): మండలంలోని అమటాంరాయవలస పంచాయతీ పరిధిలోగల జోగిపేటలో అదే గ్రామానికి చెందిన వడ్డి రాంబాబు(40) ఆదివారం ప్రమాదవసాత్తు బావిలో పడి మృతి చెందినట్లు ఎస్‌ఐ వి.పాపారావు తెలిపారు. ఎస్‌ఐ కథనం మేరకు.. జోగిపేటకు చెందిన రాంబాబు కుటుంబసభ్యులతో విశాఖలో తాపీ పనిచేసుకొని జీవిస్తున్నాడు. అయితే జోగిపేటలోగల తన చెల్లెలకు జన్మించిన బిడ్డను చూసేందుకు వచ్చాడు. గ్రామసమీపంలో ఉన్న బావిలో స్నానానికి దిగుతుండగా ప్రమాదవసాత్తు పడి నీటిలో మునిగిపోయాడు. స్థానికులు, కుటుంబ సభ్యులు గమనించి చూసేసరికి మృతిచెందాడు. సమాచారం తెలుసుకున్న పోలీసులు మృతదేహాన్ని తీయించి పంచనామా నిర్వహించారు. పోస్టుమార్టం నిమిత్తం సుందరపేట సామాజిక ఆరోగ్య కేంద్రానికి తరలించారు. రాంబాబుకు భార్య, కుమారుడు ఉన్నారు. రాంబాబు భార్య వడ్డిఅచ్చెయ్యమ్మ ఇచ్చిన ఫిర్యాదు మేరకు కేసు నమోదుచేశారు.

ఏడు మద్యం సీసాల స్వాధీనం

భోగాపురం, నవంబరు23(ఆంధ్రజ్యోతి): రావాడలో ఆదివారం ఏడు మద్యం సీసాలు స్వాధీనం చేసుకొని సంబంధిత వ్యక్తిని అదుపులోకి తీసుకుని ఎక్సైజ్ సిబ్బంది కేసు నమోదు చేశారు. ఈ సందర్భంగా ఎక్సైజ్ స్టేషన్ సీఐ వి.రవికుమార్ మాట్లాడుతూ అనధికార మద్యం కొనుగోలు చేసి ఆరోగ్యం పాడు చేసుకోవద్దని కోరారు. ఎక్సైజ్ సురక్ష యాప్ ద్వారా స్కానింగ్ చేసిన మద్యం కొనుగోలు చేయాలని తెలిపారు. ఈ దాడుల్లో ఎస్‌ఐ చంద్రమోహన్, సిబ్బంది మహేష్, శిరీష పాల్గొన్నారు.

ఎన్‌కౌంటర్లపై న్యాయ విచారణ జరపాలి



నిరసన తెలియజేస్తున్న సీపీఐ నాయకులు

విజయనగరం దాసన్నపేట, నవంబరు 23 (ఆంధ్రజ్యోతి): ప్రభుత్వంతో శాంతి చర్చలు జరపాలని ఉద్దేశంతో వచ్చిన మావోయిస్టు నేతలను ఆసుపత్రి నుంచి తీసుకువెళ్లి ఎన్‌కౌంటర్ పేరిట చంపడం దుర్మార్గమని, తక్షణమే న్యాయవిచారణ జరపాలని సీపీఐ రాష్ట్ర కార్యవర్గ సభ్యుడు పి కామేశ్వరరావు డిమాండ్‌చేశారు. విజయనగరంలోని అంబేడ్కర్ జంక్షన్‌లో సీపీఐ నియోజకవర్గకార్యదర్శి బుగత అశోక్‌ఆధ్వర్యంలో బూటకపు ఎన్‌కౌంటర్‌పై నిరసన తెలిపారు. ఈ సందర్భంగా కామేశ్వరరావు మాట్లాడుతూ చికిత్స కోసం నగరాలకు వచ్చిన మావోయిస్టులను పట్టుకుని అడవుల్లోకి తీసుకువెళ్లి ఎదురుకాల్పులు పేరిట కాల్చి చంపడం దుర్మార్గమన్నారు.కార్యక్రమంలో సీపీఐ నేతలు అప్పలరాజు, వాసు, గౌరీశంకర్, ఇబ్రహీం, నాయుడు, సూరప్పడు, నాయుడు పాల్గొన్నారు.

4న ఘంటసాల జయంతి

విజయనగరం కల్చరల్, నవంబరు 23 (ఆంధ్రజ్యోతి):గాయకుడు, పద్మశ్రీ ఘంటసాల జయంతి డిసెంబరు 4న నిర్వహించనున్నట్లు ఘంటసాల స్మారక కళాపీఠం వ్యవస్థాపక అధ్యక్ష, కార్యదర్శులు ఎం.భీష్మారావు, ధవళ సర్వేశ్వరరావులు చెప్పారు. ఆదివారం విజయనగరంలోని కళాపీఠంలో ఘంటసాల 103వ జయంతికార్యక్రమాలు పురస్కరించుకుని నిర్వహించే కార్యక్రమాల ఆహ్వానపత్రికను ఆవిష్కరించారు. కార్యక్రమంలో కళాపీఠం ప్రతినిధులు సూర్యనారాయణ, ఎస్‌వీఎల్‌ఎన్ గుప్తా, లక్ష్మణరావు పాల్గొన్నారు.

క్రమశిక్షణ అలవరుచుకోవాలి

చీపురుపల్లి, నవంబరు 23 (ఆంధ్రజ్యోతి):విద్యార్థులు చదువుతోపాటు క్రమశిక్షణ అలవరుచుకోవాలని చీపురుపల్లి డీఎస్పీ ఎస్.రాఘవులు కోరారు. ఆదివారం చీపురుపల్లి బాలుర ఉన్నత పాఠశాలలో 77వ ఎన్‌సీసీ వేడుకల్లో భాగంగా జరిగిన కార్యక్రమంలో సీఐ జి.శంకరరావు, ఎస్‌ఐ ఎల్. దామోదర రావు, హెచ్‌ఎం ఉమామహేశ్వరి, ఎన్‌సీసీ అధికారి ఎం.శ్రీను పాల్గొన్నారు.

బలిఘట్టాంలో ఎన్‌సీసీ ఉత్సవాలు

కొత్తవలస, నవంబరు 23 (ఆంధ్రజ్యోతి): మండలంలోని బలిఘట్టాం గ్రామ పరిధిలో గల ప్రగతి ఎడ్యుకేషనల్ సంస్థలో ఆదివారం 78వ ఎన్‌సీసీ ఉత్సవాలను నిర్వహించారు. కార్యక్రమంలో కొత్తవలస ఎస్‌ఐ జోగారావు, విద్యాసంస్థల ప్రతినిధులు వనము శ్రీనివాసరావు,గొంప అయ్యన్న డిఫెన్స్ అకాడమీ ప్రిన్సిపాల్ స్వామి, ఫిజికల్ ఎడ్యుకేషన్ డైరక్టర్ సుధాకర్ పాల్గొన్నారు.

ఆర్వోప్లాంట్ ప్రారంభం

కొత్తవలస, నవంబరు23 (ఆంధ్రజ్యోతి) : కొత్త సుంకరపాలెంలోని హోయినా అనాథాశ్రమంలో రెండు లక్షలతో ఆర్వోప్లాంటును ఆదివారం ప్రారంభించారు. చిన్నిపాలెం, కంటకాపల్లి గ్రామాల మధ్యలో నిర్మిస్తున్న అల్ట్రాటెక్ సిమెంట్ గ్రైడింగ్ యూనిట్ యాజమాన్యం సామాజిక అభివృద్ధి పనుల్లో భాగంగా ఆ ప్లాంట్‌ను ప్రారంభించింది.

గ్రంథాలయంలో కథల పోటీలు

విజయనగరం కల్చరల్, నవంబరు 23 (ఆంధ్రజ్యోతి): విజయనగరంలోని గురజాడ గ్రంథాలయంలో రచయిత బెహరా వెంకట సుబ్బారావు స్మారక జాతీయ స్థాయి కథల పోటీలు నిర్వహించి విజేతలకు బహుమతులు ప్రదానంచేశారు.సత్యనారాయణమూర్తి, సన్యాసిరాజు సహకారంతో జిల్లా రచయితల సంఘం, విశాఖ సాంస్కృతిక పత్రిక ఆధ్వర్యంలో నిర్వహించిన పోటీలకు న్యాయనిర్ణేతలుగా సాహితీవేత్తలు మంజూరి, ఈశ్వర రావు, డి.వెంకటరావు వ్యవహరించారు.

ఆవేదన దీక్షను విజయవంతం చేయాలి

విజయనగరం దాసన్నపేట, నవంబరు 23 (ఆంధ్రజ్యోతి): అగ్రిగోల్డ్ బాధితులకు న్యాయం చేయాలని డిసెంబరు మూడో తేదీన విజయవాడ ధర్నాచౌక్‌లో నిర్వహించనున్న ఆవేదన దీక్ష విజయవంతం చేయాలని అగ్రిగోల్డ్ బాధితుల, ఏజెంట్‌ల సంక్షేమం రాష్ట్ర అధ్యక్షుడు ఈవీ నాయుడు పిలుపునిచ్చారు. విజయనగరంలోనిలో ఏర్పాటుచేసిన సమావేశంలో మాట్లాడారు. కార్యక్రమంలో సీపీఐ నేతలు పి.కామేశ్వరరావు, సూరప్పడు, అశోక్ పాల్గొన్నారు.

క్రీడల్లో రాణిస్తే ఉజ్వల భవిష్యత్: మంత్రి



పావురాలు ఎగురవేసి క్రీడా పోటీలను ప్రారంభిస్తున్న మంత్రి శ్రీనివాస్, అదితి

విజయనగరం టౌన్, నవంబరు23(ఆంధ్రజ్యోతి): క్రీడల్లో రాణిస్తే ఉజ్వల భవిష్యత్ ఉంటుందని మంత్రి కొండపల్లి శ్రీనివాస్ తెలిపారు. ఆదివారం విజయనగరంలోని విజ్జీ మైదానంలో 69వ స్కూల్ గేమ్స్ పెడరేషన్ ఆధ్వర్యంలో అండర్-17 బాలికల రాష్ట్రస్థాయి ఖోఖో పోటీలను ఎమ్మెల్యే అదితిగజపతిరాజుతో కలిసి ప్రారంభించారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ క్రీడల్లో రాణిస్తున్న విద్యార్థులకు ప్రభుత్వాలు ప్రోత్సహిస్తాయని తెలిపారు. కార్యక్రమంలో డీఈవో యు.మాణిక్యాలనాయుడు, సమగ్ర శిక్ష ఏపీసీ రామారావు, డీఎస్‌డీవో ఎస్.వెంకటేశ్వరరావు, టీడీపీ నాయకులు ఐవీపీరాజు, టీడీపీ పట్టణాధ్యక్షుడు గంటా రవి, కుటుంబరావు స్కూల్ గేమ్స్ కార్యదర్శులు గోపాల్, విజయలక్ష్మి, ఎంఈవో సత్యవతి పాల్గొన్నారు.

టీడీపీలో 50 కుటుంబాల చేరిక

గంట్యాడ నవంబరు 23(ఆంధ్రజ్యోతి): గంట్యాడకు చెందిన బైరాగివర్మ రాజు, మురళీ రాజు, ఎంఎస్‌ఎన్ రాజుతో పాటు 50 కుటుంబాలు వైసీపీని వీడి మంత్రి కొండపల్లి శ్రీనివాస్ సమక్షంలో ఆదివారంటీడీపీలో చేరాయి. కార్యక్రమంలోని టీడీపీ మండలాధ్యక్షులు కొండపల్లి భాస్కర్ నాయుడు, టీడీపీ క్లస్టర్ ఇన్‌చార్జి రంధి చినరామునాయుడు, గంట్యాడ పీఏసీఎస్ అధ్యక్షుడు బూడి అప్పలనాయుడు, సర్పంచ్ రామారావు, టీడీపీ నాయకులు మురళి రాజు పాల్గొన్నారు.

స్థానిక ఎన్నికల్లో ఐక్యంగా పనిచేయాలి: కిమిడి



టీడీపీలో చేరిన వారికి ఆహ్వానిస్తున్న ఎమ్మెల్యే కళావెంకటరావు

చీపురుపల్లి, నవంబరు 23 (ఆంధ్రజ్యోతి): రానున్న స్థానిక సంస్థల ఎన్నికల్లో కూడా కూటమి పార్టీలు ఐక్యంగా పని చేసి, అన్ని స్థానాలను కైవసం చేసుకోవాలని చీపురుపల్లి ఎమ్మెల్యే కిమిడి కళావెంకటరావు పిలుపునిచ్చారు.పని చేసే నాయకుణ్ణి ప్రజలు ఎప్పటికీ విశ్వసిస్తారని తెలిపారు. మెరకముడిదాం మండలంలోని బుదరాయవలస, శ్యామాయవలస, సాతాంవలసకు చెందిన 700 మందికి ఆదివారం చీపురుపల్లి పార్టీ కార్యాలయంలో టీడీపీకండువాలు వేసి ఆహ్వానించారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ తోటపల్లి ప్రాజెక్టును నిర్మించి, ఈ ప్రాంతానికి సాగునీరిచ్చిన చంద్రబాబు అపర భగీరథుడని తెలిపారు.కార్యక్రమంలో టీడీపీ రాష్ట్రకార్యదర్శి కిమిడి రామ్ మల్లిక్‌నాయుడు, నాయకులు తాడ్డి సన్యాసినాయుడు, మోతీలాల్‌నాయుడు, తాడ్డి చంద్ర, సుబ్బరాజు, రెడ్డి గోవిందరావు, కెంగువ ధనుంజయ్, బాలి బంగారునాయుడు, చంటి పాల్గొన్నారు.

మౌలిక వసతుల కల్పనకు ప్రాధాన్యం: లోకం



మాట్లాడుతున్న నాగమాధవి

నెల్లిమర్ల, నవంబరు 23(ఆంధ్రజ్యోతి): రైతుల సంక్షేమమే ధ్యేయంగా కూటమి ప్రభుత్వం పని చేస్తోందని, మౌలిక వసతుల కల్పనకు ప్రాధాన్యం ఇస్తున్నామని ఎమ్మెల్యే లోకం నాగమాధవి తెలిపారు. ఆదివారం మండలంలో సతివాడ సొసైటీలో ధాన్యం కొనుగోలు కేంద్రాన్ని ప్రారంభించారు.సతివాడ, నెల్లిమర్ల, జరజాపుపేటల్లో ఆమె పలు అభివృద్ధి కార్యక్రమాలకు శంకుస్థాపన చేశారు.కార్యక్రమంలో ఏవో శ్రీలక్ష్మి,ఎంపీడీవో రామకృష్ణరాజు, డిప్యూటీ ఎంపీడీవో శంకర జగన్నాథం, సతివాడ సొసైటీ సెక్రటరీ కె.సత్తిబాబు, జనసేన నాయకుడు చనమల్లు వెంకటరమణ, టీడీపీ నగర పంచాయతీ అధ్యక్షుడు లెంక అప్పలనాయుడు, బంగారు సరోజిని, కరుమజ్జి గోవిందరావు, రవ్వా నాని పాల్గొన్నారు.

ప్రతిరైతుకూ రైతు భరోసా అందించాలి

విజయనగరం దాసన్నపేట, నవంబరు 23(ఆంధ్రజ్యోతి):రైతులపై ప్రభుత్వానికి చిత్తశుద్ధి ఉంటే ప్రతి రైతుకు రైతు భరోసా అందించాలని వైసీపీ జిల్లా అధ్యక్షుడు, జడ్పీ చైర్మన్ మజ్జి శ్రీనివాసరావు డిమాండ్‌చేశారు. జిల్లాలో మొక్కజొన్న కొనుగోలు కేంద్రాలు ఏర్పాటు చేయకపోవడం బాధకరమని తెలిపారు. ఆదివారం ధర్మపురిలో ఆయన విలేకరులతో మాట్లాడుతూ భోగాపురం ఎయిర్‌పోర్టు శంకుస్థాపన తమ హయాంలో జరిగిందని, తమ పాలనలోనే 20 శాతం పనులు పూర్తయ్యాయని తెలిపారు.

నేడు ఎమ్మెల్యే అదితి జన్మదిన వేడుకలు

విజయనగరం రూరల్, నవంబరు 23 (ఆంధ్రజ్యోతి): విజయనగరం ఎమ్మెల్యే అదితి గజపతిరాజు జన్మదినవేడుకలు సోమవారం జరగనున్నాయి. మండల, నగర కమిటీలు, అనుబంధ సంఘాల ఆధ్వర్యంలో పార్టీకార్యాలయంలో కేక్‌ను కట్ చేయనున్నారు.నగరం, మండలంలో సేవా కార్యక్రమాలు నిర్వహించనున్నారు. పార్టీ నాయకుల ఆధ్వర్యంలో పలు కార్యక్రమాలు నిర్వహించేందుకు ఏర్పాట్లు పూర్తయ్యాయి. ఈ నెల 22న పార్టీ కార్యాలయంలో మండల, నగర కమిటీలు, వివిధ స్వచ్ఛంద సంస్థలతో కలిసి నిర్వహించిన మెగా రక్త దాన శిబిరంలో 581 యూనిట్ల రక్తం సేకరించారు. కాగా జన్మదినం పురస్కరించుకుని పువ్వులు, బోకేలు తీసుకురావద్దని, శుభాకాంక్షలు తెలియజేసే సమయంలో నిరుపేద, పేద, మధ్యతరగతి విద్యార్థులకు ఉపయోగపడే పుస్తకాలు, పెన్నులను తీసుకొచ్చి ఇవ్వాలని పార్టీ నాయకులు శ్రేణులకు సమాచారం ఇచ్చారు. సోమవారం ఉదయం తొమ్మిది గంటల నుంచి ఆమె పార్టీ కార్యాలయంలో అందుబాటులో ఉంటారు.జన్మదినం పురస్కరించుకుని నాయకులు, కార్యకర్తలు నిర్వహించే పలు సేవాకార్యక్రమాల్లో ఆమె భాగస్వామ్యులు కానున్నారు.

బాధితులకు సీఎంఆర్‌ఎఫ్ ఆసరా: బంగార్రాజు



బాధితులకు చెక్కులను పంపిణీచేస్తున్న కర్రోతు బంగార్రాజు

పూసపాటిరేగ, నవంబరు23(ఆంధ్రజ్యోతి): బాధితులకు సీఎంఆర్‌ఎఫ్ ఆసరా ఉంటుందని మార్క్‌ఫెడ్ చైర్మన్, నియోజకవర్గ టీడీపీ ఇన్‌చార్జి కర్రోతు బంగార్రాజు తెలిపారు. ఆదివారం పూసపాటిరేగ టీడీపీ కార్యాలయంలో ముఖ్యమంత్రి సహాయనిధి కింద 22 మందికి రూ.14లక్షల 3వేల చెక్కులను పంపిణీచేశారు. కార్యక్రమంలో టీడీపీ రాష్ట్ర కార్యనిర్వాహక కార్యదర్శి మహంతి చిన్నంనాయుడు, రాష్ట్ర కార్యదర్శి పతివాడ తమ్మినాయుడు, టీడీపీ మండలాధ్యక్షుడు మహంతి శంకరరావు, ఆకిరి ప్రసాదరావు, గేదెల రాజారావు, పిన్నింటి శ్రీనివాసరావు, మైలపల్లి సింహాచలం పాల్గొన్నారు.

రామచంద్ర జీవితం స్ఫూర్తిదాయకం

రాజాం, నవంబరు 23 (ఆంధ్రజ్యోతి):స్వాతంత్రసమరయోధుడిగా రచయితగా తిరుమల రామచంద్ర జీవితం నేటితరానికి స్ఫూర్తిదాయకమని సాహితీవేత్త పొట్నూరు కోటిబాబు తెలిపారు. ఆదివారం రాజాంలో రాజాం రచయితల వేదిక 130వ సమావేశం జరిగింది. ఈ సందర్భంగా హంపి నుంచి హరప్పా దాకా - తిరుమల రామచంద్ర జీవన పోరాటం అన్నఅంశంపై కోటిబాబు మాట్లాడారు. సాహితీవేత్త నల్ల రవికుమార్ అధ్యక్షతనజరిగిన కార్యక్రమంలో వేదిక నిర్వాహకుడు గారరంగనాథం, రౌతు గణపతిరావు నాయుడు, పిల్లా సత్యంనాయుడు, పొదిలాపు శ్రీనివాస్, బొంతు సూర్యనారాయణ, కుదమ తిరుమలరావు, పమతం మమేశ్వరరావు, ఉరిటి గున్నేశ్వరరావు పాల్గొన్నారు.

కార్మిక వ్యతిరేక విధానాలను విడనాడాలి

నెల్లిమర్ల, నవంబరు 23(ఆంధ్రజ్యోతి): కేంద్ర ప్రభుత్వం కార్మిక వ్యతిరేక విధానాలను విడనాడాలి వైసీపీట్రేడ్ యూనియన్‌విభాగం రాష్ట్ర అధికార ప్రతినిధి దవళ లక్ష్మణరావు డిమాండ్ చేశారు.ఆదివారం నెల్లిమర్లలో విలేకరులతో మాట్లాడుతూ కార్మికులు పోరాడి సాధించుకున్న హక్కులను కోడ్‌ల ద్వారా కేంద్ర ప్రభుత్వం హరిస్తోందని ఆరోపించారు. కార్మికులపై మోదీ ప్రభుత్వం దాడులకు నిరసనగా ఈనెల 26న దేశవ్యాప్తంగా జరిగే ఆందోళనకు సంపూర్ణ మద్దతు తెలుపుతోందని ఆయన తెలిపారు. సమావేశంలో నెల్లిమర్ల నియోజకవర్గ లీగల్‌సెల్ అధ్యక్షులు నడిపేన సత్యనారాయణ పాల్గొన్నారు.

భూములు లేనివారికి పరిహారం

ఎస్.కోట రూరల్, నవంబరు 23(ఆంధ్రజ్యోతి):బొడ్డవర ప్రాంతంలో జరిగిన జిందాల్ భూసేకరణలో ఇక్కడ భూములు లేనివారికి కోట్లు రూపాయలు పరిహారం అందిందని, ఆ బినామీల నుంచి వారు మింగిన కోట్లు రూపాయలను ప్రభుత్వం కక్కించాలని జిందాల్ నిర్వాసితులు కోరారు. ఆదివారం బొడ్డవరలో జిందాల్ నిర్వాసితులు చేపట్టిన దీక్షలు 162వరోజుకు చేరాయి. ఈసందర్భంగా మాట్లాడుతూ సుమారు 60 మంది బినామీలు పరిహారం కాజేశారని ఆరోపించారు.

అన్నదాతలు అప్రమత్తం

●తుఫాన్ సమాచారంతో కుప్పలు పెడుతున్న వైనం



మీసాలడోలపేట పొలాలో వరిపంటను కుప్పలు పెట్టిన రైతులు

రేగిడి, నవంబరు 23(ఆంధ్రజ్యోతి): మండలంలోని అన్నదాతలు మరో తుఫాన్ సమాచారం నేపథ్యంలో అప్రమత్తమయ్యారు. కోసినవరి పంటను మీసాలడోలపేట, వెంక మ్మపేట, కోడిశ తదితర గ్రామాల రైతులు పొలాల్లోనే కుప్పలు పెడుతున్నారు. ఈనెల 29న తుఫాన్ సంబవించే అవకాశముందని వాతావరణశాఖ వర్గాలు చెబుతున్నాయి.

అవయవదానానికి అంగీకారం

● ముందుకొచ్చిన చీపురుపల్లిలోని ఉపాధ్యాయుడి కుటుంబ సభ్యులు

చీపురుపల్లి, నవంబరు 23 (ఆంధ్రజ్యోతి):చీపురుపల్లిలోని జి.అగ్రహారానికి చెందిన ఉపాధ్యాయుడు డోల నాగరాజు కుటుంబ సభ్యులు అవయవదానానికి అంగీకరించారు.ఆదివారం చీపురుపల్లిలోని జి.అగ్రహారానికి చెందిన ఉపాధ్యాయుడు డోల నాగరాజు కుటుంబసభ్యులు ఓ ఫంక్షన్ నిర్వహించారు. ఈ సందర్భంగా మిత్రులు, కుటుంబ సభ్యుల సమక్షంలో అవయవదానం చేయాలని నిర్ణయించినట్లు ప్రకటించారు. కుటుంబసభ్యులంతా అవయవదానం చేయాలనుకుంటున్నామని పేర్కొని వేదికపైనే అందరి సమక్షంలో అంగీకార పత్రాలపై సంతకాలుచేశారు. సంతకాలు చేసిన పత్రాలను కుటుంబ యజమాని డోలనాగరాజు మానవీయత సంస్థ అధ్యక్షుడు బీవీ గోవిందరాజులకు అందజేశారు. ఈ కార్యక్రమంలో మీసాల లక్ష్మణరావు పాల్గొన్నారు.

మైనర్లకు వాహనాలు ఇస్తే కేసులు నమోదు: సీఐ

విజయనగరం క్రైం, నవంబరు 23 (ఆంధ్రజ్యోతి): మైనర్లకు వాహనాలు ఇస్తే యాజమానులు, తల్లిదండ్రులపై కేసులు నమోదుచేసి చర్యలు తీసుకుంటామని ట్రాఫిక్ సీఐ సూరినాయుడు హెచ్చరించారు. ఆదివారం విజయనగరంలో ట్రాఫిక్‌పోలీసుల తనిఖీల్లో పట్టుబడిన మైనర్లకు సంబంధించిన వాహన యాజమానులు, తల్లిదండ్రులకు కౌన్సెలింగ్ నిర్వహించారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ విజయనగరంలో అన్ని ప్రధాన కూడళ్లల్లో మైనర్ డ్రైవింగ్ నియంత్రణకు స్పెషల్ డ్రైవ్ చేపట్టామని చెప్పారు.

పర్యవేక్షణ లేక.. ఆక్రమణలపై చర్యలు తీసుకోక

● ఇదీ కిల్తంపాలెం, ముషిడిపల్లిలో అక్రమ నిర్మాణాల పరిస్థితి

ఎస్.కోట రూరల్, నవంబరు 23 (ఆంధ్రజ్యోతి): మండలంలోని పలు శాఖల అధికారుల పర్యవేక్షణ లేకపోవడంతో ఆక్రమణలపై చర్యలు తీసుకోలేని పరిస్థితి నెలకొంది. కిల్తంపాలెం పంచాయతీ పరిధిలో 2022లో ఓ వ్యక్తి ప్రైవేట్ రిసార్ట్‌లో భవనం నిర్మించాడు. ఈ నిర్మాణం జోలికి వెళ్లే సాహసం అధికారులు చేయలేకపోయారు. అలాగే ముషిడిపల్లి పంచాయతీలో తాటిపూడి రిజర్వాయర్ భూములను విజయనగరం చెందిన ఓ వ్యక్తి 60 సెంట్లు మేర ఆక్రమించి ప్రహరీ నిర్మించాడు. దీంతో పాటు ప్రభుత్వ భూమిని ఆక్రమించి తన వ్యవసాయ క్షేత్రానికి గేటు,రహదారి ఏర్పాటుచేయడం విశేషం. అయితే ఈ ఆక్రమణలపై యువత ఏడాది కిందట గ్రీవెన్స్‌లో ఫిర్యాదుచేయడంతోపాటు తమ గ్రామానికి పలుసార్లు వచ్చిన జేసీ సేతుమాదవన్ దృష్టికి తీసుకువెళ్లారు. దీంతో రెవెన్యూ అధికారులను సర్వేచేసి ఆక్రమణలు తొలగించాలని జేసీ కోరారు. ఈ నేపథ్యంలో స్థానిక రెవెన్యూ, తాటిపూడి జలాశయం ఇరిగేషన్ సిబ్బంది సంయుక్త సర్వేచేశారు. ప్రభుత్వ భూమి 11సెంట్లు, ఇరిగేషన్ స్థలం 60సెంట్లు గుర్తించి నోటీసులిచ్చారు. అయితే ఆ వ్యక్తి స్పందించకపోవడంతో అప్పటి తహసీల్దార్ అరుణకుమారి ఆగ్రహం వ్యక్తంచేయడంతో ప్రభుత్వ భూమిలో నిర్మాణాలు స్వచ్ఛందంగా తీసేశారు.ఇరిగేషన్ అధికారులు ఆక్రమణల తొలగింపు జోలికి వెళ్లకపోవడంపై సర్వత్రా విమర్శలొస్తున్నాయి.

రాజాంలో ఫుట్‌పాత్‌ల ఆక్రమణ

● వాహనచోదకులు, పాదచారులకు తప్పని ఇబ్బందులు



ఫుట్‌పాత్‌పై గోడ నిర్మించిన దృశ్యం

రాజాం, నవంబరు 23 (ఆంధ్రజ్యోతి): రాజాం మునిసిపాలిటీలోని చీపురుపల్లి రోడ్డులో అధికారుల పర్యవేక్షణ లేకపోవడంతో ఫుట్‌పాత్‌లు ఆక్రమణలకు గురయ్యాయి. దీంతో ఫుట్‌పాత్‌పై అక్రమ నిర్మాణాల వల్ల పాదచారులు, వాహనచోదకులు ఇబ్బందుకు గురవుతున్నారు.చీపురుపల్లి రోడ్డులో ఫుట్‌పాత్‌లను ఆక్రమణల వల్ల పాదచారులు రోడ్డుమధ్య నుంచి నడిచివెళ్లే సమయంలో తరచూ ప్రమాదాలు చోటుచేసుకుంటున్నాయని పలువురు వాపోతున్నారు. బొబ్బిలి కూడలి నుంచి చీపురుపల్లి రోడ్డులోని గాయిత్రీకాలనీ వరకు చేపట్టిన రహదారుల విస్తరణలో కొందరు అధికారులతో కుమ్మక్కై, రోడ్డు పక్కన ఒకటి నుంచి రెండు అడుగులు వరకు స్థలాన్ని వదిలేలా చర్యలు చేపట్టి, అనంతరం ఫుట్‌పాత్‌ను ఆక్రమించి అక్రమ కట్టడాలు చేపడుతూ అద్దెకు ఇస్తున్నారన్న విమర్శలొస్తున్నాయి. కాగా అక్రమనిర్మాణాలు జరిగిన విషయం తన దృష్టికి వచ్చిందని కమిషనర్ డి.రామచంద్రరావు తెలిపారు. బొబ్బిలి రోడ్డులోని కొంతవరకు తొలగించామని, మిగిలిన ఆక్రమణలు తొలగించడానికి చర్యలు తీసుకుంటామని చెప్పారు.

చెకుముకి పోటీలకు గర్భాం విద్యార్థుల ఎంపిక

మెరకముడిదాం, నవంబరు 23 (ఆంధ్రజ్యోతి):మండలంలోని గర్భాం మోడల్ స్కూల్ విద్యార్థులు రాష్ట్రస్థాయి చెకుముకి పోటీలకు ఎంపికయ్యారు. పాఠశాలకు చెందిన డి.వెంకటేష్, కె.వెంకటేష్, నవీన్‌కుమార్ విజయనగరంలో జరిగిన జిల్లాస్థాయి పోటీల్లో ప్రతిభకనబరిచి రాష్ట్ర పోటీల్లో పాల్గొనేందుకు అర్హత సాధించారు. కాగా ఎంపికైన విద్యార్థులను ఎంఈవోలు ఎం.చంద్రశేఖర్, ధర్మశ్రీ, పాఠశాల ఉపాధ్యాయులు అభినందించారు.

ప్రారంభించారు.. పనులు పూర్తిచేయడం మరిచారు

●రాళ్లుతేలడంతో వాహనచోదకుల రాకపోకలకు తప్పని అగచాట్లు ●ఇదీ గరివిడి మండలంలో బీటీరోడ్ల పనుల పరిస్థితి

గరివిడి, నవంబరు 23(ఆంధ్రజ్యోతి): మండలంలోని దేవాడ, కోడూరు గ్రామాలకు, గరివిడి ప్రధానరహదారి నుంచి మంజూరైన బీటీరోడ్డు పనులు ప్రారంభమై ఏడాదిదాటినా పూర్తిచేయడాన్ని అధికారులు మరచిపోయారు. ఈనేపథ్యంలో పనుల్లో భాగంగా వేసిన మెటల్ రాళ్ల తేలడంతో వాహన చోదకులకు అగచాట్లు తప్పడంలేదు. గరివిడి ప్రధానరహదారి నుంచి పీహెచ్‌సీ, కోడూరుపై నుంచి ఫేకర్ మెయిన్‌గేటు వరకు ఉండే మట్టిరోడ్డుకు తారురోడ్డు వేయడానికి కోటీ 80లక్షలమంజూరయ్యాయి. దీంతో ఏడాది కిందటే రహదారి పనులు కూడా ప్రారంభమైనా ఇంతవరకు పూర్తికాలేదు. రహదారి పనుల్లో భాగంగా వేసిన రాళ్ల పిక్కలు తేలడంతో ప్రయాణికులు, వాహనచోదకులు అవస్థలకు గురవుతున్నారు. అలాగే దేవాడ నుంచి దుమ్మెద గ్రామానికి తారురోడ్డు నిర్మాణానికి కోటీ 30 లక్షలు మంజూరయ్యాయి. వీటి పనులు కూడా ఏడాది కిందట ప్రారంభమైనా ఇంతవరకు పూర్తికాలేదు. దీంతో ఆయా గ్రామాల ప్రజలు రహదారి ఎప్పుడు పూర్తవుతుందోనని ఎదురుచూస్తున్నారు. ఇప్పటి వరకు రోడ్డుపనుల్లో భాగంగా వేసిన మెటల్, గ్రావెల్ చాలా వరకు వర్షాలకు కరిగిపోయి రాళ్లుతేలుతున్నాయి.పనులు పూర్తిచేయడంఆలస్యం అవుతుండడంతో ఇబ్బందులుతప్పవన్న ఆందోళననెలకొంది.అధికారులు రహదారి నిర్మాణంపై దృష్టిసారించాలని వాహనచోదకులు, ఆయా గ్రామస్థులు కోరుతున్నారు. కాగా కాంట్రాక్టర్ చేసిన పనులకు బిల్లులు చెల్లింపు ఆలస్యంకావడంతో నిలిచిపోయాయని, పీఆర్ జేఈ ఎస్.హరికృష్ణ తెలిపారు. బిల్లులకు సంబంధించిన డబ్బులు మంజూరయ్యాయని, త్వరలో ప్రారంభమవుతాయని చెప్పారు.



సగంలో నిలిచిపోయిన కోడూరు రహదారి

ప్రాజెక్టుల ఆధునికీకరణకు మరో మూడేళ్లు

(ఐదో పేజీ తరువాయి)

వంగర మండలంలో 1,636.31 ఎకరాలకు మొత్తం 8,253.47 ఎకరాలకు సాగునీరు అందాల్సి ఉంది. ప్రాజెక్టు ఆధునికీకరణకు 2019 ఫిబ్రవరి 15న రూ.17.30 కోట్లతో పరిపాలనా ఆమోదం, 2020 జూన్ 22న సాంకేతిక ఆమోదం లభించాయి. ఈ పనులు చేపట్టేందుకు తెలంగాణకు చెందిన ఎస్‌కేఆర్ కనస్ట్రక్షన్స్, రాజ్‌పద్మ ఇన్ కార్పొరేషన్ సంయుక్తంగా ముందుకు వచ్చాయి. 2023 డిసెంబరు 31లోగా పనులు పూర్తి చేస్తామని అంగీకరించాయి. అయితే కేవలం 5 శాతం పనులే చేపట్టాయి. ఆ తరువాత బిల్లులు మంజూరు కాకపోవడంతో కాంట్రాక్టర్లు ముఖం చాటేశారు.

వెంగళరాయసాగర్..

ఈ ప్రాజెక్టు సాలూరు మండలం లక్ష్మీపురం గ్రామ సమీపంలో సువర్ణముఖి నదిపై ఉంది. దీని ద్వారా మక్కువ మండలంలో 14,550 ఎకరాలు, సీతానగరం మండలంలో 3,723 ఎకరాలు, విజయనగరం జిల్లా బొబ్బిలి మండలంలో 6,127 ఎకరాలు మొత్తం 24,700 ఎకరాలకు సాగునీరు అందాల్సి ఉంది. ఈ ప్రాజెక్టు ఆధునికీకరణకు సంబంధించి 2019 ఫిబ్రవరి 15న రూ. 63.50 కోట్లతో పరిపాలనా ఆమోదం, 2020 జూలై 11న సాంకేతిక ఆమోదం లభించాయి. పెదంకలాం ప్రాజెక్టు కాంట్రాక్టర్లే ఈ ప్రాజెక్టును కూడా దక్కించుకున్నారు. రూ.48.90 కోట్లుతో ఒప్పందం కుదుర్చుకున్నారు. అగ్రిమెంట్ ప్రకారం 2023 ఏప్రిల్ 25 నాటికి పనులు పూర్తి చేయాల్సి ఉంది. కానీ కేవలం 21 శాతం పనులు మాత్రమే పూర్తి చేయగలిగారు. ఆ తరువాత 2025 మార్చి 24 వరకు గడువు ఇచ్చినా ఫలితం లేకపోయింది.

గడువు ప్రభుత్వమే నిర్ణయిస్తుంది..

జిల్లాలో ప్రాజెక్టుల ఆధునికీకరణ విషయంలో 2020లో ఇచ్చిన ఎస్ఎస్ఆర్ ప్రకారం పనులు చేయాలని కాంట్రాక్టర్లను కోరాం. అయితే కొందరు చేయలేమంటున్నారు. దీనిని బట్టి గడువు పొడిగింపు విషయం ప్రభుత్వం తేల్చనుంది. అంగీకరించి ముందుకొస్తే డిసెంబరు నుంచే పనులు ప్రారంభమవుతాయి.

-ఆర్.అప్పారావు, ఎస్ఈ, నీటి పారుదలశాఖ, పార్వతీపురం మన్యం జిల్లా

నలుగురు సచివాలయ కార్యదర్శుల సస్పెన్షన్

(ఐదో పేజీ తరువాయి)

స్పందించి విచారణకు ఆదేశించారు. దీంతో జిల్లా పంచాయతీ అధికారి విచారణ చేపట్టి నివేదికను కలెక్టర్‌కు అందించారు. ఈ మేరకు నలుగురు సచివాలయ కార్యదర్శులను సస్పెండ్ చేశారు. సస్పెండ్‌కు గురైన వారిలో గతంలో కొమరాడ పంచాయతీలో పనిచేస్తూ సీతానగరం మండలం అంటిపేట సచివాలయానికి బదిలీపై వెళ్లి పస్తుతం డెప్యుటేషన్‌పై పార్వతీపురం మండలం అడ్డాపుశీల గ్రామ సచివాలయ కార్యదర్శిగా పనిచేస్తున్న గణపతి, గరుగుబిల్లి మండలం కుంకిడివరం సచివాలయం కార్యదర్శి వైకుంఠరావు, సీతానగరం మండలం జోగిపేట పంచాయతీలో నిధుల దుర్వినియోగం అయినట్లు ఆరోపణలు ఎదుర్కొని ప్రస్తుతం సస్పెన్షన్‌లో ఉన్న శ్రీనివాసరావు, కొమరాడ పంచాయతీలో విధులు నిర్వహిస్తున్న నాగరాజు ఉన్నారు. ఈ వ్యవహారంలో ఇప్పటికే పంచాయతీ సర్పంచ్‌కు షోకాజ్ నోటీసులు జారీ చేశారు. దీనిపై డీపీవో కొండలరావును వివరణ కోరేందుకు ప్రయత్నించగా ఆయన ఫోన్ లిఫ్ట్ చేయలేదు. డీఎల్‌పీవో నాగభూషణరావు వద్ద ప్రస్తావించగా.. 'గణపతి, వైకుంఠరావు, నాగరాజు, శ్రీనివాసరావు సస్పెండ్ అయిన మాట వాస్తవమే.' అని అన్నారు. పార్వతీపురం ఎంపీడీవో వద్ద ప్రస్తావించగా గణపతి సస్పెండ్ అయినట్లు కార్యాలయానికి ఆదేశాలు వచ్చాయని తెలిపారు.

స్నానానికి దిగి..రబ్బర్ డ్యాంలో గల్లంతై

(ఐదో పేజీ తరువాయి)

పెట్టుకొని కుటుంబాన్ని పోషించుకుంటున్నాడు. తండ్రి చనిపోగా, తల్లి, భార్య, ఇద్దరు పిల్లలు ఉన్నారు. పిల్లలు రెండో తరగతి, మూడో తరగతి చదువుతున్నారు. శరత్‌కుమార్ పార్వతీపురం పట్టణంలోని ఆర్కే జూనియర్ కళాశాలలో ఇంటర్ చదువుతున్నాడు. తండ్రి ట్రాక్టర్ నడుపుతూ కుటుంబాన్ని పోషిస్తున్నాడు. అన్నయ్య తుశాంత్ ఉన్నాడు. ఇద్దరూ ఒకే కళాశాలలో ఒకే తరగతి చదువుతున్నారు. ప్రదీప్ మచిలీపట్నంలో రొయ్యల చెరువులో పనిచేస్తున్నాడు. తండ్రి వ్యవసాయ కూలి కాగా, అన్నయ్య విశాఖపట్నంలో ప్రైవేటు ఉద్యోగం, చెల్లి ఊరిలో ప్రాథమిక వ్యవసాయ పరపతి సంఘంలో అసిస్టెంట్‌గా పనిచేస్తున్నారు. స్నేహితుని వివాహం కోసం ప్రదీప్ స్వగ్రామానికి వచ్చి గల్లంతుకావడంతో కుటుంబ సభ్యులు రోదిస్తున్నారు.

మంత్రుల ఆరా

●పార్వతీపురం, నవంబరు 23 (ఆంధ్రజ్యోతి): కొమరాడ మండలంలో రబ్బరు డ్యాం వద్ద ముగ్గురు యువకులు గల్లంతు కావడంపై జిల్లా ఇన్‌చార్జి మంత్రి కింజరాపు అచ్చెన్నాయుడు, మంత్రి గుమ్మిడి సంధ్యారాణి తీవ్ర దిగ్భ్రాంతిని వ్యక్తం చేశారు. ఈ సంఘటనపై కలెక్టర్ ప్రభాకర్‌రెడ్డితో మంత్రులు మాట్లాడి వివరాలను అడిగి తెలుసుకున్నారు. ఇటువంటి సంఘటనలు భవిష్యత్తులో జరగకుండా తగు చర్యలు తీసుకోవాలని అధికారులను కలెక్టర్ ఆదేశించారు.

ఘనంగా సత్యసాయి శత జయంత్యుత్సవం




పార్వతీపురం టౌన్: మాట్లాడుతున్న కలెక్టర్ ప్రభాకర్‌రెడ్డి.. పాలకొండ: వేడుకల్లో సబ్ కలెక్టర్



గుమ్మలక్ష్మీపురం: సత్యసాయి జయంతి వేడుకల్లో ప్రభుత్వ విప్

గుమ్మలక్ష్మీపురం, నవంబరు23 (ఆంధ్రజ్యోతి): భగవాన్ సత్యసాయి బాబా సేవా మార్గాన్ని అనుసరిద్దామని ప్రభుత్వ విప్ తోయక జగదీశ్వరి అన్నారు. స్థానిక మండల రెవెన్యూ కార్యాలయంలో ఆదివారం సత్యసాయి బాబా శత జయంతి ఉత్సవాన్ని ఘనంగా నిర్వహించారు. కార్యక్రమంలో ఆమె ముఖ్యఅతిథిగా పాల్గొన్నారు. ఈ సందర్భంగా ప్రభుత్వ విప్ మాట్లాడుతూ సత్యసాయి బాబా ప్రపంచానికి జ్ఞానాన్ని, సన్మార్గాన్ని చూపించా రన్నారు. కార్యక్రమంలో ఐసీడీఎస్ పీడీ కనకదుర్గ, తహసీల్దార్ శేఖరం, కూటమి నాయకులు, రెవెన్యూ సిబ్బంది పాల్గొన్నారు.

●పార్వతీపురం టౌన్: సత్యసాయి చెప్పినట్టు దయగల హృదయమే దైవమందిరమని ప్రతి ఒక్కరూ గుర్తుంచుకోవాలని కలెక్టర్ ఎన్.ప్రభాకర్‌రెడ్డి అన్నారు. ఆదివారం జిల్లా కేంద్రంలోని కంచరవీధిలోగల సత్యసాయి మందిరంలో బాబా శత జయంతి ఉత్సవాలను ఘనంగా నిర్వహించారు. ఉత్సవాలకు కలెక్టర్ ముఖ్యఅతిథిగా హాజరై పతాకావిష్కరణ చేశారు. అనంతరం ఆయన మాట్లాడుతూ అందరినీ ప్రేమిస్తూ, అందరినీ సేవిస్తే అదే మన జన్మకు సార్థకత అన్నారు. కుల మతాలకు తావులేకుండా సత్యసాయి బోధనలు ప్రపంచవ్యాప్తంగా ప్రసిద్ధి చెందాయన్నారు. మధ్యాహ్నం నారాయణ సేవతో పాటు నిరుపేదలకు వస్త్రాలను పంపిణీ చేశారు. సాయంత్రం దీపారాధన, రాత్రి బాలవికాస్ పిల్లల నృత్య ప్రదర్శనలు చేపట్టారు. కార్యక్రమంలో జేసీ యశ్వంత్ కుమార్ రెడ్డి, డీఆర్వో కె.హేమలత, సబ్ కలెక్టర్ ఆర్.వైశాలి, జిల్లా దేవాదయశాఖాధికారి రాజారావు, సత్యసాయి సేవా సమితి సభ్యులు పాల్గొన్నారు.

●పాలకొండ: సత్యసాయిబాబా బోధనలు అనుసరణీయమని పాలకొండ సబ్ కలెక్టర్ పవర్ స్వప్నిల్ జగన్నాథ్ అన్నారు. పట్టణంలోని సత్యసాయి మందిరంలో ఆదివారం బాబా శతజయంతి ఉత్సవాన్ని ఘనంగా నిర్వహించారు. ఈ కార్యక్రమానికి సబ్ కలెక్టర్ ముఖ్య అతిథిగా పాల్గొన్నారు. ఈ సందర్భంగా ఆయన కేక్‌ను కట్ చేశారు. అనంతరం సబ్ కలెక్టర్ మాట్లాడుతూ సత్యసాయిబాబా ఎన్నో సేవా కార్యక్రమాలు చేశారన్నారు. కార్యక్రమంలో మండల ప్రత్యేక అధికారి మన్మథరావు, డీఏఈ రాధారాణి, సమితి కన్వీనర్లు కిషోర్, కర్ర సుధాకర్ పాల్గొన్నారు.

●సీతంపేట రూరల్: భగవాన్ సత్యసాయిబాబు సేవలు చిరస్మరణీయమని ఐటీడీఏ ఇన్‌చార్జి పీవో పవార్ స్వప్నిల్ జగన్నాథ్ అన్నారు. స్థానిక సత్యసాయి బాబా మందిరంలో ఆదివారం బాబా శత జయంతి ఉత్సవాలను ఘనంగా నిర్వహించారు. వేడుకల్లో ముఖ్యఅతిథిగా ఇన్‌చార్జి పీవో పాల్గొన్నారు. ఈ సందర్భంగా ఆయన వృద్ధులు, అనాథలకు దుప్పట్లు, రగ్గులను పంపిణీ చేశారు. వేడుకల్లో మందిరం కమిటీ సభ్యులు రామకృష్ణ, పకీరునాయుడు, నరసింహులు, రమణ, భీమారావు, నాగేశ్వరరావు పాల్గొన్నారు.

●గరుగుబిల్లి: మండల కేంద్రంలో ఆదివారం సత్యసాయి బాబా శత జయంతి ఉత్సవాలను అధికారులు ఘనంగా నిర్వహించారు. సత్యసాయి చిత్రపటానికి ఎంపీడీవో జి.పైడితల్లి, డిప్యూటీ ఎంపీడీవో ఎల్.గోపాలరావు, ఆర్‌డబ్ల్యూఎస్ జేఈ ఎ.గౌరీశంకర్‌తో పాటు పలువురు పూలమాలలు వేసి నివాళులర్పించారు.

●భామిని: బత్తిలి, సొలికిరి, పెద్దదిమిలి గ్రామాల్లో సత్యసాయిబాబా మందిరాల్లో ఆదివారం శత జయంతి ఉత్సవాలను ఘనంగా నిర్వహించారు. సొలికిరిలో బాబా చిత్రపటాన్ని ఊరేగించారు. బత్తిలిలోని మందిరంలో హెచ్‌సీ సంగమేశ్వరరావు పతకాన్ని ఆవిష్కరించారు. మహిళలు సాయి వ్రతాలు నిర్వహించారు.

●సీతానగరం: మరిపివలసలో భగవాన్ సత్యసాయి బాబా శత జయంతి ఉత్సవాలను ఆదివారం ఘనంగా నిర్వహించారు. మండల ప్రత్యేక అధికారి శ్రీనివాస్, ఎంపీడీవో ఎంఎల్ఎన్ ప్రసాద్, మండల పరిషత్ సిబ్బంది కార్యక్రమంలో పాల్గొన్నారు.

●వీరఘట్టం: వీరఘట్టం, నడుకూరు, నడిమికెల్ల, కడకెల్ల, గడగమ్మ, కిమ్మి, కత్తులకవిటి, చిదిమి, విక్రంపురంలో ఆదివారం సత్యసాయి శత జయంతి ఉత్సవాన్ని ఘనంగా నిర్వహించారు. మధ్యాహ్నం అన్నసమారాధన నిర్వహించారు. సాయంత్రం కేక్‌ను కట్‌చేశారు.

●జియ్యమ్మవలస: సేవాభావమే సాయి మంత్రమని డీపీవో కొండలరావు అన్నారు. ఆదివారం మండల పరిషత్ కార్యాలయంలో స్థానిక సత్యసాయి భజన మండలి కన్వీనర్ కోలక నాగరాజు ఆధ్వర్యంలో భగవాన్ సత్యసాయిబాబా శత జయంతి వేడుకలు నిర్వహించారు. ఈ సందర్భంగా సేవాకార్యక్రమాలు, శ్రద్ధ, ఓర్పు, సహనం, ప్రేమ కోసం ప్రజలకు డీపీవో వివరించారు. కార్యక్రమంలో ఆర్ఐ సీతారామరాజు పాల్గొన్నారు.



భామిని: బత్తిలిలో సాయి వ్రతాలు నిర్వహిస్తున్న మహిళలు



జియ్యమ్మవలస: వేడుకల్లో డీపీవో కొండలరావు



వీరఘట్టం: సత్యసాయి మందిరంలో పూజలు

మన్యంలో పర్యాటకుల సందడి




మెట్టుగూడ జలపాతం వద్ద స్నానాలు చేస్తున్న పర్యాటకులు, ఎన్టీఆర్ అడ్వంచర్ పార్క్‌లో స్కై సైక్లింగ్

సీతంపేట రూరల్, నవంబరు 23 (ఆంధ్రజ్యోతి): సీతంపేట ఏజెన్సీలోని పర్యాటక ప్రదేశాలకు ఆదివారం పర్యాటకులు పోటెత్తారు. మన్యంలోని ఆడలి, జగతిపల్లి వ్యూపాయింట్, సున్నపుగెడ్డ, మెట్టుగూడ జలపాతం, సీతంపేట ఎన్టీఆర్ అడ్వంచర్‌పార్‌లో పర్యాటకులు సందడి చేశారు. మెట్టుగూడ జలపాతం అందాలను వీక్షిస్తూ జలపాతంలో మహిళలు, చిన్నారులు స్నానాలు ఆచరించారు. అలాగే ఫొటో షూట్ పాయింట్‌లో సెల్ఫీలు దిగారు. ఎన్టీఆర్ అడ్వంచర్‌పార్క్‌లో సాహసోపేత క్రీడల్లో పర్యాటకులు పాల్గొని ఉత్సాహంగా గడి పారు.

విద్యార్థుల్లో విజ్ఞానాన్ని పెంపొందించాలి



విజేతలతో నిర్వాహకులు, ఉపాధ్యాయులు

పార్వతీపురం టౌన్, నవంబరు23 (ఆంధ్రజ్యోతి): ప్రాథమిక స్థాయి నుంచి విద్యార్థుల్లో విజ్ఞానాన్ని పెంపొందించాల్సిన అశ్యకత ఉందని జిల్లా జనవిజ్ఞాన వేదిక అధ్యక్ష, ప్రధాన కార్యదర్శులు ఎస్.మహేశ్వరరావు, కె.గౌరునాయుడు అన్నారు. ఆదివారం పట్టణంలోని వేదాంత జూనియర్ కళాశాలలో జిల్లా స్థాయి చెకుముకి సైన్స్ సంబరాలను నిర్వహించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ విద్యార్థులకు సైన్స్‌పై పట్టు సాధించేందుకు చెకుముకి టాలెంట్ పరీక్షలు ఉపయోగపడతాయన్నారు. విద్యార్థి దశ నుంచి సైన్స్‌ను నేర్చుకోవడంతో పాటు పోటీ పరీక్షల్లో పాల్గొనడం ద్వారా భవిష్యత్‌లో ఉన్నత శిఖరాలను అధిరోహించే అవకాశం ఉందన్నారు. జిల్లాస్థాయి సైన్స్ సంబరాల్లో విజేతలు డిసెంబరు 21 నుంచి కాకినాడ జేఎన్‌టీయూలో నిర్వహించే రాష్ట్ర స్థాయి సైన్సు సంబరాల్లో పార్వతీపురం మన్యం జిల్లా తరుపున పాల్గొంటారన్నారు. జిల్లా స్థాయి చెకుముకి సైన్సు సంబరాల్లో ప్రభుత్వ పాఠశాలల విభాగంలో జడ్పీఉన్నత పాఠశాల మాతుమూరు (పాచిపెంట మండలం), తమ్మినాయుడు ఉన్నత పాఠశాల (పాలకొండ మండలం) ప్రథమ స్థానంలో నిలిచి రాష్ట్ర స్థాయి చెకుముకి సైన్సు సంబరాలకు అర్హత సాధించాయని తెలిపారు.

సత్తా చాటిన 'ఆదర్శ' విద్యార్థులు

భామిని, నవంబరు23 (ఆంధ్రజ్యోతి): జిల్లాస్థాయి చెకుముకి పోటీల్లో భామిని ఆదర్శ పాఠశాల విద్యార్థుల ప్రతిభ కనబరిచారని ప్రిన్సిపాల్ బాబురావు తెలిపారు. ఆదివారం జిల్లా స్థాయి చెకుముకి సంబరాలు పార్వతీపురం మన్యం జిల్లా వేదాంత జూనియర్ కళాశాలలో నిర్వహించారు. ఈ పోటీల్లో సుమారు 17 పాఠశాలల విద్యార్థులు పాల్గొన్నారు. ఈ పోటీల్లో భామిని ఆదర్శ పాఠశాలకు చెందిన అఖిల, కావ్యశ్రీ, అలేఖ్య జిల్లా స్థాయిలో ద్వితీయ స్థానం కైవసం చేసుకున్నారు. ప్రతిభ కనబరిచిన విద్యార్థులకు ప్రిన్సిపాల్, ఉపాధ్యాయులు అభినందించారు.

ఉపాధిలో అక్రమాలకు తావివ్వవద్దు

గరుగుబిల్లి, నవంబరు23 (ఆంధ్రజ్యోతి): ఉపాధి హామీ పనుల్లో అవినీతి అక్రమాలకు తావులేకుండా అవసరమైన చర్యలు చేపడుతున్నట్టు ఏపీవో ఈశ్వరమ్మ, జేఈ డి.తేజేశ్వరరావు తెలిపారు. ఆదివారం రావుపల్లిలో గ్రామ సభ నిర్వహించారు. ఈ సందర్భంగా వీరు మాట్లాడుతూ జాబ్‌కార్డులు లేని వేతనదారులు కార్డు కోసం దరఖాస్తు చేసుకుంటే మంజూరు చేస్తామన్నారు. గ్రామసభలో ప్రతినిధులు బోను సత్యనారాయణ, బోను శివకుమార్, టెక్నికల్ అసిస్టెంట్ ఎం.ఉమామహేశ్వరరారి, క్షేత్ర సహాయకులు ఎం.శంకరరావు, తదితరులు ఉన్నారు.

మెరుగైన సాగు పద్ధతులపై అవగాహన

బెలగాం, నవంబరు23 (ఆంధ్రజ్యోతి) : రైతు కుటుంబాల సంక్షేమం, అనుబంధ రంగాల అభివృద్ధి లక్ష్యంగా జిల్లా వ్యాప్తంగా 'అన్నదాత' కార్యక్రమం కింద సమగ్ర సర్వే నిర్వహణకు సంబంధిత శాకల అధికారులు సన్నద్ధమవుతున్నారని కలెక్టర్ డా.ఎన్.ప్రభాకర్ రెడ్డి తెలిపారు. ఆదివారం కలెక్టర్ విలేకరులతో మాట్లాడుతూ రైతలకు మెరుగైన సాగు పద్ధతిలపై అవగాహన కలిగించి వారికి అవసరమైన వాటి గురించి తెలుసుకుని ప్రభుత్వం పథకాల ద్వారా అందించేందుకు కృషి చేస్తున్నామన్నారు. సర్వేలో సేకరించిన వివరాలు, కుటుంబ సభ్యుల ఫొటోలను ప్రత్యేకంగా అందించిన మొబైల్ యాప్‌లో నమోదు చేయాలన్నారు. ఈ సర్వే త్వరలో ప్రారంభమవుతుందన్నారు.

అర్జీలను వెబ్‌సైట్‌లో నమోదు చేయవచ్చు

పార్వతీపురం, నవంబరు23 (ఆంధ్రజ్యోతి): ప్రజాసమస్యలు పరిష్కార వేదిక (పీజీఆర్ఎస్)లో అర్జీలను మీకోసం వెబ్‌సైట్‌లో నమోదు చేయవచ్చునని కలెక్టర్ ఎన్.ప్రభాకర్‌రెడ్డి ఓ ప్రకటనలో తెలిపారు. సమర్పించిన అర్జీల స్థాయిను 1100 టోల్ ఫ్రీ నెంబర్‌కు ఫోన్ చేసి వివరాలు తెలుసుకోవచ్చునన్నారు. కలెక్టర్ కార్యాలయంలో ప్రతిరోజూ ప్రజల నుంచి వినతులు స్వీకరించడానికి సెల్లార్‌లో ప్రత్యేకంగా సెల్‌ను ఏర్పాటు చేశామన్నారు. అర్జీదారులు మీకోసం డాట్ ఏపీ డాట్ జీవోవి డాట్ ఇన్ వెబ్‌సైట్‌లో అర్జీలు నమోదు చేసుకోవచ్చునన్నారు.

విజేతలకు నగదు ప్రోత్సాహకాలు

పాలకొండ, నవంబరు23 (ఆంధ్రజ్యోతి): పట్టణంలో నిర్వహించిన సత్యసాయి టాలెంట్ హంట్ ఎగ్జామ్‌లో విజేతలకు మామిడి వేణుగోపాల నాయుడు ఆదివారం నగదు ప్రోత్సాహకాలను అందజేశారు. విజేతలు జి.చైతన్య, వంశీకృష్ణ, లహరిలకు వరుసగా రూ.5 వేలు, రూ.3 వేలు, రూ.2 వేలు పంపిణీ చేశారు. కార్యక్రమంలో ఎన్.వి.రమణ, సంపత్‌కుమార్, వాసుదేవరావు, హేమనీకుమార్, సురేష్ పాఢి, రామకృష్ణ, శ్రీరాములు, బౌరోతు శంకరరావు, నాగరాజు, వాసుదేవరావు, సతీష రామలక్ష్మి శారదామణి, సత్యప్రభ, గణపతి తదితరులు పాల్గొన్నారు.

యాదవ సంఘ జిల్లా అధ్యక్షుడిగా ధనుంజయ

జియ్యమ్మవలస, నవంబరు23 (ఆంధ్రజ్యోతి): యాదవ సంక్షేమ సంఘం జిల్లా అధ్యక్షుడిగా కన్నపుదొరవలసకు చెందిన ఈపు ధనుంజయ ఏకగ్రీవంగా ఎన్నికయ్యారు. కన్నపుదొరవలసలో ఆదివారం యాదవ సంక్షేమ సంఘం సమావేశం నిర్వహించారు. ఈ సమావేశంలో ఈయనను ఏకగ్రీవంగా ఎన్నుకున్నారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ జిల్లాలో యాదవ కులస్థులు ఎదుర్కొంటున్న సమస్యలను జిల్లా అధికారులకు, రాష్ట్ర నాయకత్వానికి తెలియజేసి సమస్యలు పరిష్కరించేలా కృషి చేస్తానన్నారు. కార్యక్రమంలో యాదవ కులానికి చెందిన నాయకులు, ప్రజలు పాల్గొన్నారు.

రచ్చబండకు శంకుస్థాపన

గుమ్మలక్ష్మీపురం, నవంబరు23 (ఆంధ్రజ్యోతి): మండల కేంద్రంలోని ప్రతిభాభారతి కాలనీలో ఆదివారం రచ్చబండ స్లాబ్ నిర్మాణానికి ప్రభుత్వ విప్ తోయక జగదీశ్వరి శంకుస్థాపన చేశారు. ఆమె వెంట మాజీ కన్వీనర్ పాడి సుదర్శనరావు, సొనైల రామారావు, కాలనీవాసులు పాల్గొన్నారు.

ముమ్మరంగా వాహన తనిఖీలు

సీతంపేట రూరల్, నవంబరు23 (ఆంధ్రజ్యోతి): సీతంపేట వారపుసంత సమీపంలో ఆదివారం ఎస్ఐ అమ్మనరావు ఆధ్వర్యంలో పోలీసులు వాహన తనిఖీలను చేశారు. మావోయిస్టులు భారత్ బంద్‌కు ఇచ్చిన పిలుపు మేరకు పోలీసులు అప్రమత్తమయ్యారు. పాలకొండ-హడ్డుబంగి ప్రధాన రహదారిలో ప్రతీ వాహనాన్ని క్షుణ్ణంగా పరిశీలించారు. తనిఖీల్లో ట్రైనీ ఎస్ఐలు, సిబ్బంది పాల్గొన్నారు.

'తోటపల్లి' ట్రస్ట్ బోర్డు ప్రమాణ స్వీకారం

● చైర్మన్‌గా పకీరునాయుడు



చైర్మన్ పకీరునాయుడును సత్కరిస్తున్న దృశ్యం

గరుగుబిల్లి, నవంబరు23 (ఆంధ్రజ్యోతి): ఉత్తరాంధ్రలో చినతిరుపతిగా ప్రసిద్ధిగాంచిన తోటపల్లి శ్రీవెంకటేశ్వర, కోదండరామస్వామి దేవస్థానాల ట్రస్ట్ బోర్డు ఆదివారం కొలువుదీరింది. శ్రీవెంకటేశ్వరస్వామి దేవస్థానం ఆవరణలో నిర్వహించిన కార్యక్రమంలో బొబ్బిలి దేవాదయశాఖ తనిఖీదారు ఎస్.రాజకుమారి, దేవస్థానం ఈవో బి.శ్రీనివాస్ ప్రమాణ స్వీకారం చేయించారు. ఈ సందర్భంగా దేవస్థానం చైర్మన్‌గా మార్కొండ పకీరునాయుడును ఏకగ్రీవంగా ఎన్నుకున్నారు. ప్రమాణ స్వీకారోత్సవానికి తోటపల్లి దేవస్థానాల అభివృద్ధి సేవా ట్రస్ట్ ప్రతినిధి డాక్టర్ డి.పారినాయుడు అధ్యక్షత వహించారు. ఈ సందర్భంగా ఎంపీపీ ఉరిటి రామారావు, కార్పొరేషన్ డైరెక్టర్లు అంబటి రాంబాబు, అక్కేన మధుసూదనరావు మాట్లాడుతూ 1970లో దేవాలయ ప్రతిష్ఠకు తోటపల్లికి చెందిన దాతలు ముందుకు వచ్చారన్నారు. గత 45 ఏళ్లకు పైగా 9 మంది చైర్మన్లు ఇతర ప్రాంతాలకు చెందిన వారేనన్నారు. దేవస్థానానికి భూములను దానం చేసిన మార్కొండ కుటుంబ సభ్యులకు చైర్మన్ స్థానాన్ని కేటాయించాలని ప్రభుత్వ విప్ తోయక జగదీశ్వరిని కోరామన్నారు. ఇందుకు ఆమె సానుకూలంగా స్పందించి పకీరునాయుడు నియామకానికి దృష్టి సారించడం అభినందనీయ మన్నారు. ప్రమాణం చేసిన వారిలో ఆర్.రాజేశ్వరి, ఎస్.పకీరునాయుడు, జి.మీన, వి.పద్మజ, ఎం.నారాయణరావు, ఎ.జానకి, బి.సుభాషిణి, భగవాన్ వరప్రసాద్ మిశ్రో, ఎస్.లక్ష్మి, ఎం.కృష్ణంనాయుడుతో పాటు దేవస్థానం ప్రధాన అర్చకులు ఎక్స్ అఫీషియో సభ్యులుగా వీవీ అప్పలాచార్యులు ప్రమాణం చేశారు. ఈ సందర్భంగా దేవస్థానం చైర్మన్‌గా ప్రమాణ స్వీకారం చేసిన పకీరునాయుడును కార్పొరేషన్ డైరెక్టర్లు ఎ.రాంబాబు, ఎ.మధుసూదనరావు, కృష్ణబాబు, ఎంపీపీ ఉరిటి రామారావు, ఎంపీటీసీ సభ్యులు మరడాన సింహాచలం నాయుడు, టీడీపీ నాయకులు ఎంపురుషోత్తంనాయుడు, ఎం.తవిటి నాయుడు ఎం.మురళీ మోహన్ తదితరులు సత్కరించారు.

బకాయిలు చెల్లించండి

పాలకొండ, నవంబరు23 (ఆంధ్రజ్యోతి): నగర పంచాయతీ పారిశుధ్య కార్మికులకు బకాయి వేతనాలను చెల్లించాలని సీఐటీయూ జిల్లా అధ్యక్షుడు దావాల రమణారావు డిమాండ్ చేశారు. ఆదివారం పట్టణంలో నిర్వహించిన సమావేశంలో ఆయన మాట్లాడారు. ప్రజలు ఆరోగ్యాలు కాపాడే పారిశుధ్య కార్మికులకు వేతనాలు చెల్లింపులో జాప్యం తగదన్నారు. సమావేశంలో యూనియన్ కార్యదర్శి సంజీవి, వేణు, రఘు, రామారావు, సింహాచలం, గిరి తదితరులు పాల్గొన్నారు.



దుడ్డుకళ్లు ఆశ్రమ పాఠశాల పరిశీలన

గుమ్మలక్ష్మీపురం, నవంబరు23 (ఆంధ్రజ్యోతి): దుడ్డుకళ్లు గిరిజన సంక్షేమ ఆశ్రమ పాఠశాలను ఆదివారం తహసీల్దార్ శేఖరం సందర్శించారు. విద్యార్థుల ఆరోగ్య పరిస్థితిని పరిశీలించారు. భోజన సదుపాయం, పారిశుధ్యం తదితర వాటిని పరిశీలించారు. విద్యార్థులు క్రమశిక్షణతో మెలగాలని సూచించారు.

క్యాబేజీ రైతుల ఆందోళన



పువ్వులను అమ్మకానికి సిద్ధం చేస్తున్న రైతులు

వీరఘట్టం, నవంబరు23 (ఆంధ్రజ్యోతి): మొంథా తుఫాన్ ప్రభావం క్యాబేజీ పంట దిగుబడులపై పడిందని రైతులు ఆందోళన చెందుతున్నారు. క్యాబేజీ పంట జిల్లాలో అధికంగా వీరఘట్టంలోనే సాగుచేస్తారు. ఈ ఏడాది సుమారు 400 ఎకరాల్లో క్యాబేజీ పంట వేశారు. ఇక్కడి నుంచి రాష్ట్రంలో పాటు పొరుగు రాష్ట్రం ఒడిశాకు రైతులు ఎగుమతి చేస్తుంటారు. అయితే మొంథా తుపాన్ కారణంగా క్యాబేజీ పంట చిన్న పువ్వులు వేశాయని రైతులు అంటున్నారు. దీంతో నష్టాలను చవిచూస్తున్నామన్నారు. ఎకరాకు రూ.25 వేల మేర ఖర్చు చేసినా ఆశించిన దిగుబడి రాలేదని రైతులు ఆందోళన చెందుతున్నారు. పంటను వీలైనంతవరకు కోసి అమ్మకాలు చేపడుతున్నామన్నారు.



అతిథులతో ఎన్‌సీసీ క్యాడెట్లు

దేశ ప్రగతికి యువతే కీలకం

ఒడిశా

రాయగడ, నవంబరు23 (ఆంధ్రజ్యోతి): యువత చేతిలోనే దేశ భవిత ఇమిడి ఉందని, దేశ ప్రగతికి యువతే కీలకమని జడ్పీ సీఈవో అక్షయ్‌కుమార్ ఖెముండు అన్నారు. స్థానిక స్వయం ప్రతిపత్తి కళాశాలలో ఆదివారం ఎన్‌సీసీ డే నిర్వహించారు. ఈ కార్యక్రమానికి ఆయన ముఖ్యఅతిథిగా పాల్గొని మాట్లాడారు. యువత క్రమశిక్షణతో విద్యనభ్యసించి దేశఖ్యాతిని పెంపొందించాలన్నారు. బీఎస్ఎఫ్ లెఫ్టినెంట్ కల్నల్ ఆర్.సి.భరత్వాల్ మాట్లాడుతూ దేశ ప్రగతి, దిశా నిర్దేశం నిర్వాహణలో యువత పాత్ర చాలా ముఖ్యమన్నారు. కార్యక్రమంలో కళాశాల ప్రిన్సిపాల్ సరస్వతి రాయ్, బాలుర ఎన్‌సీసీ అధికారి లెఫ్టినెంట్ ఉదయ్ నాయక్, బాలికల ఎన్‌సీసీ అధికారిణి కేశవ్‌కుమార్ జానీ క్యాడెట్లను ఉద్దేశించి మాట్లాడుతూ క్యాడెట్లు విద్యలో ఉన్నత శిఖరాలను అధిరోహించడంతో పాటు దేశరక్షణలో కూడా భాగస్వాములు కావాలని ఆకాంక్షించారు. అనంతరం క్యాడెట్లు నిర్వహించిన సాంస్కృతిక కార్యక్రమాలు అందరినీ అలరించాయి. కార్యక్రమంలో అధ్యాపకులు భాస్కర గుప్తా పాల్గొన్నారు



